సాక్షి
తూర్పుగోదావరి

శనివారం । 14 । జనవరి । 2023

SAKSHI PREMIER LEAGUE

ధనాధన్ టోర్నీకి వేళాయె..


సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల (జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది. - IIలో



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఎం.కళ్యాణ చక్రవర్తి (హైదరాబాద్ కొంపెల్ల) శుక్రవారం రూ.1,00,008 విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 5,970 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,760, మధ్య డెల్టాకు 1,145, పశ్చిమ డెల్టాకు 3,065 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 6.70 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

మార్గదర్శకాలకు అనుగుణంగా అనుమతులు



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): టెలికాం రంగంలో నూతనంగా రానున్న సాంకేతిక పరిజ్ఞానం 4జీ, 5జీ ఆధునీకరణలో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ మాధవీలత అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ మాధవీలత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 4 జీ, 5 జీ సాంకేతిక పరిజ్ఞానం కోసం ఎటువంటి ఫారెస్ట్ క్లియరెన్స్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఈ విషయంలో టెలికం వెండర్స్ నుంచి జిల్లా పరిధిలో పెండింగ్ పనులు చేపట్టాల్సిన అవసరం లేదని తెలిపారు.

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, సంక్రాంతి పండగను ఘనంగా జరుపుకోవాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. సూర్యభగవానుడు మకర సంక్రాంతి వేళ ప్రజల జీవితాల్లో సంతోషాలు ప్రసాదించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. ప్రజలందరి జీవితాల్లో మకర సంక్రాంతి మరిన్ని శుభాలను, వెలుగులను నింపాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు.

ప్రశాంతంగా కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈవో అబ్రహం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లుగా (లెక్కలు, ఇంగ్లిషు, బయాలజీ, సోషల్) ప్రమోషన్ పొందేందుకు సమ్మతి తెలిపిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. స్థానిక ఇన్నీసుపేటలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ జరిగింది. ఇంగ్లిష్ విభాగంలో 172 మందికి 171, గణితంలో 75 మందికి 74, జీవశాస్త్రంలో 49 మంది, సోషల్‌లో 49 మంది హాజరైనట్టు డీఈవో తెలిపారు. రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎం.తిరుమలదాస్, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ ఏడీ సుబ్బారావు, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తికి ఫొటో అందజేస్తున్న దృశ్యం

అన్నవరం: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.

జగన్ పాలనలో రోజూ పండగే

- హోంమంత్రి తానేటి వనిత
- రాజమహేంద్రవరంలో వైభవంగా జగనన్న సంక్రాంతి సంబరాలు
- పాల్గొన్న మంత్రి వేణు, ఎంపీ భరత్, పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజా

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జగనన్న ప్రభుత్వంలో రాష్ట్రంలోని ప్రజలందరికీ ప్రతిరోజూ పండగేనని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత అన్నారు. పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్, నగర పాలకసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మున్సిపల్ స్టేడియం ప్రాంగణంలో వైఎస్సార్ సీపీ నిర్వహించిన జగనన్న సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా చేసిన ఏర్పాట్లు పల్లెటూరి వాతావరణాన్ని గుర్తుకు తెచ్చాయి.

పల్లెటూరి శోభ

భోగిమంట, హరిదాసులు, గంగిరెద్దులు, జోడెద్దుల బళ్లు, కోడిపందేలు.. ఇలా పల్లెటూరి సంక్రాంతి శోభను కళ్లకు కట్టినట్టు తీర్చిదిద్దారు. పండగ నేపథ్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. వందల మంది మహిళలు, యువతులు హాజరై తమ నైపుణ్యాలను చూపించారు. ఎంపీ భరత్ రామ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సంబరాలలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ, సినిమాటోగ్రఫీ, సమాచారశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్య అతిథులుగా హాజరై సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు.

సంస్కృతీ పరిరక్షణకు దోహదం

మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకునేందుకు, వాటిని భావితరాలకు అందించేందుకు పండగలు ఎంతో దోహదపడతాయన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ పాడి పంటలతో సుఖసంతోషాలతో జీవనం సాగించడానికి చిహ్నంగా సంక్రాంతిని జరుపుకొంటామన్నారు. కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో సంక్రాంతి ఒక రోజు ముందుగానే వచ్చిందని, అందుకు ఈ స్టేడియంలో జరుగుతున్న సంబరాలే నిదర్శనమన్నారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణిస్తే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందన్నారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలందరికీ పండగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, రాష్ట్ర తెలికుల గాండ్ల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిన భవానీ ప్రియ, రాష్ట్ర ఖాదీబోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు మార్గాని నాగేశ్వరరావు, పాలిక శ్రీను, గుర్రం గౌతమ్, డాక్టర్ అనసూరి పద్మలత, మజ్జి అప్పారావు, కాంతారామ్ పాటిల్, నరవ గోపాలకృష్ణ పాల్గొన్నారు.



సోడెమ్మలు, హరిదాసులతో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, కమిషనర్ దినేష్ కుమార్



కోలాటం ఆడుతున్న మంత్రి తానేటి వనిత, కలెక్టర్ మాధవీలత, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు



భోగిమంటలో పిడకలు వేస్తున్న మంత్రి వేణు, చిత్రంలో మంత్రి వనిత, కలెక్టర్ మాధవీలత, ఎంపీ భరత్ రామ్

వీరు సై..వారు నై నై..





- సంక్రాంతి కోడిపందేలకు సిద్ధమవుతున్న నిర్వాహకులు
- ఉమ్మడి 'తూర్పు'న సిద్ధమవుతున్న 100 బరులు
- 20కి పైగా కీలకమైనవి
- రూ.200 కోట్లు పైగా లావాదేవీలు జరుగుతాయని అంచనా
- 'కత్తి' కడితే కట్టడి తప్పదంటున్న పోలీసులు
- గుండాటలు, జూదాలకూ 'నో'

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సంప్రదాయం పేరుతో కోడి పందేలకు కత్తులు కట్టి మరీ నిర్వాహకులు సిద్ధమవుతూంటే.. అటు పోలీసులు నిబంధనల కొరడా ఝళిపిస్తూ కో'ఢీ'కి ససేమిరా అంటున్నారు. దీంతో సంక్రాంతి పండగ వేళ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఉత్కంఠ వాతావరణం కనిపిస్తోంది. సంక్రాంతి సందర్భంగా సంప్రదాయబద్ధంగా కోడిపందేలు నిర్వహించడం తరతరాల ఆనవాయితీగా వస్తోంది. కోళ్లకు కత్తులు కట్టకుండా సంప్రదాయ పందేలు నిరభ్యంతరంగా నిర్వహించుకోవచ్చు. మొదటి నుంచీ ఈ మాట పోలీసులే చెబుతున్నారు. కత్తులు కట్టి కోడిపందేలు నిర్వహిస్తే కటకటాల్లో వేస్తామని నాలుగైదు రోజులుగా హెచ్చరిస్తున్నారు. అయితే సంక్రాంతి మూడు రోజులూ నిర్వహించే పందేల కోసం ఆగస్టు నెల నుంచి లక్షలకు లక్షలు పోసి పందెంకోళ్లను బలవర్ధక ఆహారంతో పెంచి పోషిస్తూ వచ్చాం. ఇప్పుడు కత్తులు కట్టొద్దు, పందేలు వద్దంటే ఎలాగని నిర్వాహకులు అంటున్నారు. కత్తులు కట్టకుండా, రూ.కోట్లు పలకకుండా ఆడే కోడిపందేల్లో మజా ఏముంటుందని ప్రశ్నిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఎలాగైనా 'తమదైన శైలిలో' పందేలు నిర్వహించేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. పనిలో పనిగా పందేలతో పాటు గుట్టు చప్పుడు కాకుండా గుండాటలు, జూదాలు ఆడేందుకు కూడా తెరవెనక ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

- అసలు కోడిపందేలు ఉంటాయా ఉండవా అనే సందిగ్ధంలో చాలాచోట్ల గురువారం వరకూ బరులు సిద్ధం చేయలేదు. పలువురు నిర్వాహకులు పొరుగున పశ్చిమ గోదావరి జిల్లాకు మకాం మార్చేశారు కూడా.
- కోనసీమలో గత పండగకు బరి ఏర్పాటు చేసిన నిర్వాహకుడు స్థానిక వ్యతిరేకతతో పందేల బరిని ఈసారి తాళ్లరేవు మండలం నీలపల్లికి మార్చేశాడు. రెండు రోజులుగా బరుల కోసం టెంట్లు వేయడం, వాటిని పోలీసులు తొలగించడం జరుగుతోంది.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అత్యధికంగా కోడి పందేలు జరుగుతుంటాయి. ఇక్కడ ఈ ఏడాది కూడా అదే ఒరవడి కొనసాగుతోంది. పందేల్లో కోనసీమ తరువాతి స్థానం కాకినాడ జిల్లాకే దక్కుతుంది. ఈ ఏడాది నవ్య తూర్పు గోదావరి జిల్లాలో కూడా బరులు సిద్ధమవడంతో పందెం కోడి సై అంటోంది.
- ఉమ్మడి జిల్లాలో కత్తి కట్టి రూ.కోట్లు మార్చే బరులు 70 వరకూ ఉంటాయి. అత్యధికంగా రూ.కోటి, రూ.2 కోట్ల పందేలు జరిగే బరులు 20 వరకూ ఉన్నాయి. వీటిలో కూడా కోనసీమదే అగ్రస్థానం. చిన్నాచితకా అన్నీ లెక్కేస్తే మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 100 వరకూ బరులు ఉంటాయని గత లెక్కలే చెబుతున్నాయి.
- కోడిపందేలు ఒక ఎత్తయితే.. వీటి ముసుగులో ఏర్పాటు చేసే గుండాట బోర్డులకు కూడా రూ.లక్షల్లోనే ఒప్పందాలు జరుగుతూంటాయి.

కోనసీమ జిల్లాలో..

- రాజోలు మండలం చింతలపల్లి, కాట్రేనిపాడు, కూనవరం, లక్కవరం, గోగన్నమఠం, వీవీ మెరక, సఖినేటిపల్లి, రామేశ్వరం, సఖినేటిపల్లి లంకల్లో బరులు రూ.లక్షలు పలుకుతున్నాయి. ఒక్కో బరిలో రూ.అర కోటి పైనే పందేలు జరిగే పరిస్థితి కనిపిస్తోంది.
- ఆత్రేయపురం మండలం లొల్ల, పేరవరం, వసంతవాడ, ర్యాలితో పాటు రావులపాలెం మండలంలోని మూడు బరుల్లో తలపడేందుకు పందెంకోళ్లు సై అంటున్నాయి.
- కొత్తపేట మండలంలో మూడు బరుల్లో ఏర్పాట్లు ఉన్నాయి.
- అల్లవరం, కోడూరుపాడు, గోడి, గుత్తులవారిపాలెం, రెల్లుగడ్డ, గుండెపూడి గ్రామాల్లో కోడిపందేల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.
- ముమ్మిడివరం మండలం పల్లిపాలెం, అన్నంపల్లి, కొత్తలంక, చెయ్యేరు. గెద్దనాపల్లి, మొక్కలతిప్ప, కొమరగిరి, బాణపురాల్లో కోడిపందేలకు సన్నాహాలు జరుగుతున్నాయి.
- తాళ్లరేవు మండలం నీలపల్లి, గాడిమొగ, జార్జిపేట, సుంకరపాలేల్లో పందేలకు ఏర్పాట్లు చేశారు.
- మండపేటలో మూడు బరులతో పాటు ఏడిద, ద్వారపూడి, వెంటూరు, కపిలేశ్వరపురం లంక గ్రామాల్లో సైతం పందేలకు కోళ్లు కాలు దువ్వుతున్నాయి.

తూర్పు గోదావరి జిల్లాలో..

- అనపర్తి, కుతుకులూరు, బిక్కవోలు, కొమరిపాలెం, బలభద్రపురం, రంగంపేట, వడిశలేరు, దొంతమూరు, సింగంపల్లి, పెదరాయవరం, దొడ్డిగుంట గ్రామాల్లో కోడిపందేలకు ఏర్పాట్లు చేశారు. రామేశ్వరం, జి.మామిడాడ, శహపురం, కాండ్రేగుల, పెదపూడి, గండ్రేడు గ్రామాల్లో పందెంకోళ్లు తలపడనున్నాయి.
- రాజానగరం నియోజకవర్గంలోని 12 గ్రామాల్లో పందెం కోళ్లు తలపడే పరిస్థితి ఉంది. పుణ్యక్షేత్రం, ముక్కినాడ, నరేంద్రపురం, దివాన్‌చెరువు, నిడిగట్ల, గాడాల, శ్రీరంగపట్నం, దోసకాయలపల్లి, గాదరాడ, రఘుదేవపురం, పెదకొండేపూడి, నల్గొండ, మిర్తిపాడు గ్రామాల్లో బరులు ఏర్పాటయ్యాయి.
- కొవ్వూరులోని తాళ్లపూడి, గజ్జరం, పెద్దేవం, రావూరుపాడు గ్రామాల్లో కోడిపందేల బరులు సిద్ధమయ్యాయి. మండలంలో కోడిపందేలు ఆపాలంటూ పలువురు హైకోర్టులో పిటిషన్ కూడా వేశారు.

సంప్రదాయానిదే పైచేయి

పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టి, ఎంత కట్టడి చేసినా ఏటా ఉమ్మడి జిల్లాలో పండగ మూడు రోజులూ కోడిపందేలను నిలువరించలేని పరిస్థితి. పోలీసు ఆంక్షలపై ఇక్కడి ప్రజల సంస్కృతీ సంప్రదాయాలదే ఎప్పుడూ పైచేయి అవుతోంది. అందుకే ఏటా బరులు, వాటిలో కోడిపందేలు, అక్కడ ఏర్పాటు చేసే తినుబండారాల స్టాళ్లలో జరిగే లావాదేవీలు రూ.200 కోట్లు పైనే ఉంటున్నాయని అంచనా.



తాళ్లరేవు మండలం నీలపల్లిలో కోడిపందేలకు సిద్ధమైన బరి



తాళ్లరేవు మండలం నీలపల్లి బరిలో విస్తృత ఏర్పాట్లు



అల్లవరం మండలం కోడూరుపాడులో కొబ్బరి తోటలో బరికి ఏర్పాట్లు

పెద్ద పండగకు వేళాయే



ప్రయాణికులతో కిటకిటలాడిన ఆర్టీసీ కాంప్లెక్స్



బస్టాండ్‌లో వేచిఉన్న ప్రయాణికులు

- బస్సులు ,రైళ్లు కిటకిట
- రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ

రాజమహేంద్రవరం సిటీ: సంక్రాంతి పండగ సమీపించడంతో జిల్లాలో రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. శుక్రవారం కూడా వివిధ ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు, అత్తవారిళ్లకు జనం పయనమయ్యారు. భోగి పండగ నాటికి చేరుకోవాలనే ఉత్సాహంతో చాలామందిలో కనిపించింది. ఫలితంగా జిల్లాలోని రైల్వే స్టేషన్లు,బస్ కాంప్లెక్స్‌లు కిక్కిరిసిపోయాయి. బస్సుల్లో నిలబడి వెళ్లేందుకు సైతం సిద్ధమవుతున్నారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినప్పటికీ గమ్యస్థానాలు చేరాలనే తొందరలో నిలబడేందుకు చోటు దొరికితే చాలని భావిస్తున్నారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ బస్‌కాంప్లెక్స్ ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా కనిపించింది. ప్రధానంగా హైదరాబాద్ ఏరియా నుంచి రాజమహేంద్రవరం, కొవ్వూరు, గోకవరం, నిడదవోలు డిపోలకు తరలి వచ్చే ప్రయాణికుల కోసం రెగ్యులర్ సర్వీసులతో పాటు అదనంగా 14 ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని మరిన్ని బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రణాళికతో సిద్ధంగా ఉన్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా జిల్లాకు వచ్చే ప్రయాణికుల కోసం ఈ నెల 6 నుంచి 14 వరకూ సాధారణ టికెట్‌తో 80 స్పెషల్ బస్సులు నడుపుతున్నారు.

ఈనెల 14వ తేదీ వరకూ తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చే ప్రయాణికుల కోసం ఈ బస్సులు నడవనున్నాయి. విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం ప్రాంతాలకు షెడ్యూల్ బస్సులతో పాటు కాకుండా విశాఖపట్నం వెళ్లే ప్రయాణికుల రద్దీని అనుసరించి 20 ప్రత్యేక బస్సులు నడిపారు. హైదరాబాద్ నుంచి జిల్లాకు వస్తున్న 14 బస్సులు పూర్తిగా నిండిపోయాయని డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. సంక్రాంతి పండగ పూర్తయ్యాక మళ్లీ గమ్య స్థానాలకు చేర్చేందుకు అవసరమైన బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు.

రైళ్లదీ అదే తీరు

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నడుపుతున్న ప్రత్యేక రైళ్లు జిల్లా మీదుగా 18 వరకూ రాకపోకలు సాగిస్తాయి. సామర్లకోట, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లో ఆగే రైళ్లతో పాటు కాకినాడ టౌన్– సికింద్రాబాద్, విశాఖపట్నం–సికింద్రాబాద్, కాకినాడ టౌన్–తిరుపతి మధ్య 14వ తేదీవరకూ కూడా స్పెషల్ రైళ్లను రైల్వేశాఖ నడుపుతోంది. జిల్లాకు తరలివచ్చే ప్రయాణికులకు ప్రధాన రైల్వే స్టేషన్ రాజమహేంద్రవరం. దీంతో ఈ స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంది. జిల్లాకు వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో ప్లాట్‌ఫారాలు రద్దీగా కనిపిస్తున్నాయి. జనరల్ బోగీలు, రిజర్వేషన్ బోగీలు వ్యత్యాసం లేకుండా ప్రయాణికులు కిక్కిరిసి ప్రయాణం సాగిస్తున్నారు. రోజూ మాదిరిగా కాకుండా సంక్రాంతి సందర్భంగా స్పెషల్ రైళ్లలో మరో 8 వేల మంది రాకపోకలు సాగిస్తారని అంచనా.

ముగ్గురు చిన్నారులపై తేనెటీగల దాడి

- సకాలంలో స్పందించిన సీఐ
- వెంటనే ఆస్పత్రికి తరలింపు
- కోలుకుంటున్న విద్యార్థులు

నిడదవోలు : నిడదవోలు మండలం సింగవరం గ్రామంలో శుక్రవారం ముగ్గురు చిన్నారులపై తేనెటీగల దాడి చేశాయి. సంక్రాంతి పండగ సందర్భంగా నిర్వహిసున్న ఆటల పోటీలలో పాల్గొని ఇంటికి తిరిగి వస్తుండగా ఈ సంఘటన జరిగింది. ఈ గ్రామానికి చెందిన కాయల శ్యామ్, కాయల పుష్పక్‌తో పాటు అంగర సాయికుమార్ అనే విద్యార్థులు ఆటల పోటీలలో పాల్గొన్నారు. అవి ముగిశాక తిరిగి ఇంటికి వెళుతున్నారు. ఈ సమయంలో కొందరు ఆకతాయిలు వేపచెట్టుకు ఉన్న తేనెతుట్టను రాళ్లతో కొట్టారు. దీంతో ఒక్కసారిగా తేనెటీగలు రోడ్డుపై వెలుతున్న ముగ్గురు చిన్నారులపై దాడి చేశాయి. సైకిల్‌పై వెలుతున్న మరో వ్యక్తి కె. ప్రవీణ్‌కుమార్ కూడా తేనెటీగల బారిన పడ్డారు. అవి దాడి చేసి ఒళ్లంతా కుట్టడంతో కంగారుపడ్డ చిన్నారుల అరుపులు విని అటువైపు వెళుతున్న నిడదవోలు సీఐ కె. వెంకటేశ్వరరావు అక్కడకు చేరుకున్నారు. ముగ్గురు చిన్నారులను తన జీపులో ఎక్కించుకుని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో సీఐపై కూడా తేనెటీగలు దాడి చేశాయి. సీఐతో పాటు ముగ్గురు చిన్నారులకు పూర్తి స్థాయిలో వైద్య చికిత్సలు చేయించారు. ప్రస్తుతం చిన్నారులు కోలుకుంటున్నారు. వారికి ఎటువంటి ప్రాణభయం లేదని వైద్యులు ధ్రువీకరించారు. చిన్నారులను సకాలంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై నాగరాజుని పలువురు అభినందిస్తున్నారు. స్వల్పంగా గాయపడిన సీఐ కోలుకున్నారు. శ్యామ్ ఆరవ తరగతి, పుష్పక్ రెండో తరగతి, మణికంఠ ఐదో తరగతి చదువుతున్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న చిన్నారులు



సీఐ వెంకటేశ్వరరావుకి చికిత్స చేస్తున్న వైద్యులు

విరివనాల్లో సంక్రాంతి శోభ



పుల్లా చినసత్యనారాయణ తన నర్సరీలో ఏర్పాటు చేసిన మొక్కల కూర్పు

కడియం: సంక్రాంతి సందర్భంగా మండలంలోని విరివనాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. వినూత్నంగా చేసిన మొక్కల కూర్పుతో పండగ శుభాకాంక్షలు తెలిపాయి.

- కడియపులంక వద్ద జాతీయ రహదారిపై ఉన్న పుల్లా చిన సత్యనారాయణకు చెందిన సత్యదేవ నర్సరీలో మొక్కల కూర్పుతో భారతదేశ పటం, అందులో నాగలితో ఉన్న రైతును తీర్చిదిద్దారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని చాటి చెప్పేలా ఈవిధంగా ఏర్పాటు చేసి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసినట్లు నర్సరీ రైతు చినసత్యనారాయణ తెలిపారు.
- కడియం – వీరవరం రోడ్డులోని పల్లా సత్యనారాయణకు చెందిన పల్ల వెంకన్న నర్సరీలో వివిధ రకాల మొక్కలతో గాలిపటం ఆకృతి రూపొందించారు. ఆరు రకాల మొక్కలతో చేసిన ఈ కూర్పు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



పల్ల సత్యనారాయణ తన నర్సరీలో..

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

SAKSHI DIGITAL MEDIA GROUP | SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి.

https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22వతేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్-19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్-25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్ఠంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్‌గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబరు : 9912220345

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

జిల్లా మీదుగా 'వందేభారత్' పరుగులు



వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు

రాజమహేంద్రవరం సిటీ: పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు (20833/20834) ఆదివారం జిల్లా మీదుగా పరుగులు తీయనుంది. ఇప్పటికే రైల్వే అధికారులు సికింద్రాబాద్ – విశాఖపట్నం మధ్య ఈ రైలుకు ట్రయల్ రన్ నిర్వహించారు. విశాఖపట్నం – సికింద్రాబాద్ మధ్య నడిచే ఈ రైలు తక్కువ సమయంలో గమ్యాన్ని చేరనుంది. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, అదే రోజు రాత్రి 8.58 గంటలకు రాజమహేంద్రవరం చేరుతుంది. 9 గంటలకు విశాఖపట్నం బయలుదేరుతుంది. 16వ తేదీ ఉదయం 5.45 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరే ఈ రైలు 7.55 గంటలకు రాజమహేంద్రవరం చేరుతుంది. ఈ రైలు ఆదివారం మినహా మిగిలిన ఆరు రోజులూ నడుస్తుంది. ఈ నూతన రైలుకు రాజమహేంద్రవరంలో స్వాగతం పలికేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ద్వారపూడిలో రేపు మకరజ్యోతి దర్శనం

మండపేట: ఆంధ్రా శబరిమలగా ఖ్యాతికెక్కిన ద్వారపూడి అయ్యప్ప స్వామి సన్నిధిలో ఈ నెల 15వ తేదీన మకరజ్యోతి దర్శనానికి ఆలయ వ్యవస్థాపకుడు కనకరాజు గురుస్వామి ఆధ్వర్యాన విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజు తెల్లవారుజామున గణపతి హోమంతో ప్రత్యేక పూజలు ఆరంభిస్తారు. స్వామివారి ఇరుముడి అభిషేకాలు, స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. స్వామివారి ఆభరణాల పెట్టెను రాజమహేంద్రవరానికి చెందిన వ్యాపారవేత్త ములకల సత్యకుమార్‌స్వామి ఊరేగింపుగా ఆలయానికి తీసుకువస్తారు. భారీ ఎత్తున బాణసంచా కాల్పుల నడుమ సాయంత్రం 6.40 గంటల సమయంలో భక్తులకు మకరజ్యోతి దర్శనభాగ్యం కలగనుంది. ఉదయం నుంచి రాత్రి వరకూ జరిగే ప్రత్యేక పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కనకరాజు గురుస్వామి కోరారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌లో మార్పులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల తేదీల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. జనరల్ విభాగంలో థియరీ పరీక్షలు ముందుగా ప్రకటించినట్టుగానే యథాతథంగా జరుగుతాయి. ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్ఎల్వీ నరసింహం శుక్రవారం ఈ విషయం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ విభాగంలో థియరీ పరీక్షలు మార్చి 15 నుంచి ఏప్రిల్ 4 వరకూ జరుగుతాయన్నారు. జనరల్ విభాగంలో ప్రాక్టికల్ పరీక్షలు వచ్చే నెల 26 నుంచి మార్చి 7 వరకూ, వృత్తి విద్యా విభాగంలో ప్రాక్టికల్స్ వచ్చే నెల 20 నుంచి మార్చి 7 వరకూ నిర్వహిస్తామని వివరించారు. ఆదివారాల్లోనూ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

క్లుప్తంగా

హెర్బ్‌పే రోల్‌లో నమోదు కావాలి



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న సత్యనారాయణ

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ప్రభుత్వ ఉద్యోగులందరూ తప్పనిసరిగా హెర్బ్‌పే రోల్ వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా ఖజానా, లెక్కల అధికారి ఎస్.సత్యనారాయణ అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం డీడీఓలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులందరూ విధిగా ఈ–కేవైసీని హెర్బ్‌పే రోల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. దానివల్ల జీతం విషయాలలో పారదర్శకత ఉంటుందన్నారు. కార్యక్రమంలో సహాయ ఖజానా అధికారులు కేవీవీ సుబ్రహ్మణ్యం, కె.పూజా విహారి, ఉప ఖజానాధికారి ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా దోసాలమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామ దేవత దోసాలమ్మ జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈనెల 18వ తేదీ వరకూ వీటిని నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిరోజూ అమ్మవారి గరగ సేవ జరుగుతుందన్నారు. ఈ నెల 16వ తేదీ కనుమరోజు అమ్మవారి ఉయ్యాలసేవ జరుగుతుందని, సాయంత్రం 6 గంటలకు ఉత్సవమూర్తి భారీ ఊరేగింపు, సంబరం నిర్వహిస్తామన్నారు. 17వ తేదీన అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకోవచ్చన్నారు. 18 నుంచి 28వ తేదీ వరకు అమ్మవారి గరగలు ఎవరైనా తమ ఇంటి వద్ద పొన్నుకు తీసుకువెళ్లాలనుకొనే భక్తులు ఆలయ కమిటీని సంప్రదించాలన్నారు. 29వ తేదీ ఉదయం 11 నుంచి అన్నసమారాధన జరుగుతుందన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


వేమగిరిలో దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ నాగేశ్వర్

కడియం: మండలంలోని వేమగిరి పంచాయతీ పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ చేతుల మీదుగా శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఎక్కడెక్కడి నుంచో స్వగ్రామాలకు వస్తారని, ఆయా గ్రామాల్లో చక్కని పారిశుధ్యం ఉండేలా కార్మికులు కృషి చేయాలని చందన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రత్నకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు బడుగు చిన్ని, విప్పర్తి ఫణి కుమార్, చిలుకూరి రామకృష్ణ, శ్రీను, పంచాయతీ కార్యదర్శి కె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు అందజేత

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు, పిడింగొయ్యి గ్రామ పంచాయతీలోని పారిశుధ్య కార్మికులకు శుక్రవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలను కొనియాడారు. మోరంపూడి కోనేరుపేటలో పార్టీ నాయకుడు చీరా రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలో విజేతలకు చందన నాగేశ్వర్, మాజీ ఎమ్మెల్యే చందన రమేష్ చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. ఎంపీడీవో కె.రత్నకుమారి, హుకుంపేట సొసైటీ చైర్ పర్సన్ బొప్పన సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ కందిరెల్లి సత్తిబాబు పాల్గొన్నారు.

బుచ్చెంపేటలో విషాదఛాయలు

మధురపూడి: కోరుకొండ మండలం బుచ్చెంపేటకు చెందిన పదో తరగతి విద్యార్థి డోకుబుర్ర సుభాష్(15) మృతితో శుక్రవారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాలుడి అంత్యక్రియలు శుక్రవారం గ్రామంలో నిర్వహించారు. కోరుకొండలోని చెరుకూరి విద్యాలయంలో చదువుతున్న సుభాష్ తోటి విద్యార్థులతో కలసి గురువారం విహారయాత్రకు వెళ్లాడు. అడ్డతీగల మండలం పైడిపుట్ట వద్దగల కన్నేరు వాగులో స్నానానికి దిగాడు. జారుడు రాళ్లున్న ఆ వాగులో మునిగిపోతున్న మరో విద్యార్థిని కాపాడబోయి మృతి చెందాడు. డోకుబుర్ర వీర్రాజు, ఆనందిని దంపతులకు సుభాష్‌తో పాటు కుమార్తె సుశాంతి (ఇంటర్) ఉన్నారు. వీర్రాజు గోకవరం మండలం కామరాజుపేట హైస్కూల్లో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. కుమారుడి మృతితో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.


ముగ్గుల పోటీ ప్రథమ విజేతకు స్కూటీ అందజేస్తున్న ఎంపీ భరత్ రామ్ తదితరులు


బొమ్మూరు వెంకటగిరి కొండపై బహుమతులు అందజేస్తున్న చందన నాగేశ్వర్, చందన రమేష్


మున్సిపల్ స్టేడియంలో జరిగిన సంబరాల్లో హరిదాసుకు బియ్యం వేస్తున్న యువతి


మున్సిపల్ స్టేడియంలో జరిగిన ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు



పుల్లా చంటియ్య నర్సరీలో ఏర్పాటు చేసిన మొక్కల కూర్పు

పండగ వేళ.. సందడి భళా..

- ఆకట్టుకున్న సంక్రాంతి సంబరాలు
- సంస్కృతిని తెలిపేలా ప్రదర్శనలు


జగనన్న సంబరాల్లో పిట్టలదొర మాటలు వింటున్న మంత్రులు వేణు, వనిత, ఎంపీ భరత్ రామ్, కలెక్టర్ మాధవీలత, షర్మిలారెడ్డి తదితరులు


మున్సిపల్ కాలనీ మైదానంలో ఎడ్లబండిపై సవారీ చేస్తున్న రాజానగరం ఎమ్మెల్యే రాజా, టీకే విశ్వేశ్వరరెడ్డి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక మున్సిపల్ స్టేడియం ప్రాంగణంలో వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'జగనన్న సంక్రాంతి సంబరాలు' అంబరాన్నంటాయి. మంత్రులు చెల్లుబోయిన వేణు, తానేటి వనిత, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఎల్.వెంకటలక్ష్మి (38వ డివిజన్)కి స్కూటీ, ద్వితీయ స్థానంలో నిలిచిన టి.ఆదిశ్రీ (4వ డివిజన్)కి ఎల్‌సీడీ, తృతీయ బహుమతిగా ఎల్.జ్యోతి (15వ డివిజన్)కి ట్యాబ్, మరో ఏడుగురు విజేతలకు ఫ్రిడ్జ్, వాషింగ్ మెషీన్, ఎయిర్ కూలర్, గోద్రేజ్ బీరువా, ఓవెన్, ఫెడస్టల్ ఫ్యాన్, టీపాయ్ సెట్ అందజేశారు. పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ పోటీలలో 300 మంది మహిళలు పాల్గొన్నారు

మున్సిపల్ కాలనీ మైదానంలో..

ప్రకాశం నగర్: గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు, రాజమహేంద్రి మహిళా కళాశాలల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మున్సిపల్ కాలనీ మైదానంలో జరిగిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ముగ్గుల పోటీలు, ఎడ్లబళ్ల ప్రదర్శన, గుర్రపు స్వారీ, కోడి పందేల నమూనా బరి, హరిదాసుల సంకీర్తనలు, కొమ్ముదాసు పాటలు, సోది వంటి కార్యక్రమాలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.5 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3 వేలు, తృతీయ బహుమతిగా రూ.2 వేలు అందజేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు చీర పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనసూరి శ్రీనివాస్, పద్మలత, బర్రే కొండబాబు, కానుబోయిన సాగర్, పినిశెట్టి సుబ్బరాజు, జీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరి జీవితాల్లో వెలుగులు

రాజమహేంద్రవరం రూరల్: సంక్రాంతి పండగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆకాంక్షించారు. శుక్రవారం సాయంత్రం బొమ్మూరు వెంకటగిరికొండపై జీపీఆర్ స్కూల్ రోడ్డులో చేనేత కార్మికుల సంక్షేమ సంఘం, గోదావరి ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూర్మా మెహర్ మల్లికార్జున ప్రసాద్ నేతృత్వంలో చిన్నారులకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. అనంతరం చందన నాగేశ్వర్, మాజీ ఎమ్మెల్యే చందన రమేష్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీడీవో కె.రత్నకుమారి, పార్టీ నాయకులు యెనుముల త్యాగరాజు, ఎలుగొండ లక్ష్మి, దాకే శ్రీను, మత్సేటి శివకుమార్ పాల్గొన్నారు.

చంటియ్య నర్సరీలో..

కడియం: కడియపులంకలోని పుల్లా సత్యనారాయణ (చంటియ్య)కు చెందిన సత్యదేవ నర్సరీలో సంక్రాంతి మొక్కల కూర్పు ఏర్పాటు చేశారు. గంగిరెద్దు, హరిదాసు, పాలకుండ తదితర ఆకృతులను మొక్కలతో రూపొందించారు. సంప్రదాయ ప్రాధాన్యతను తెలిపేందుకు ఈ ఏర్పాటు చేసినట్లు నర్సరీ రైతు పుల్లా పెద సత్యనారాయణ తెలిపారు.

సీటీఆర్‌ఐ: భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ నఖచిత్రకారుడు డాక్టర్ రవి పరస తన గోటితో భోగి పండగ విశిష్టను తెలిపే నఖ చిత్రాన్ని గీశారు.


రవి పరస గీసిన నఖచిత్రం


కడియపుసావరంలో ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ మురళీకృష్ణ

కడియపుసావరంలో..

కడియం: కడియపుసావరంలో సర్పంచ్ చక్కపల్లి మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో యువతులు, మహిళలు పోటీపడి తమ ప్రతిభను చాటారు. మొదటి బహుమతిని తానేపల్లి శిరీష, రెండో బహుమతిని పెదమల్లు నవ్య, మూడో బహుమతిని గుత్తుల రిషిత, నాలుగో బహుమతిని భావన కళ్యాణి, ఐదో బహుమతిని మామిడి రిబ్కా సాధించారు. వీరికి సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

మార్కెట్‌కు సంక్రాంతి శోభ


కొనుగోలుదారులతో కిక్కిరిసిన మెయిన్ రోడ్డు


వస్త్రాలను కొనుగోలు చేస్తున్న దృశ్యం

- కొనుగోలుదారులతో కిక్కిరిసిన రోడ్లు
- ఆఫర్లు ప్రకటించిన వ్యాపారులు

ప్రకాశం నగర్: పెద్ద పండగగా పిలిచే సంక్రాంతిని ఘనంగా జరుపుకొనేందుకు నగరవాసులు సమాయత్తమవుతున్నారు. ఈ నేపథ్యంలో పండగ దుస్తులు కొనుగోలు చేసేందుకు రాజమహేంద్రవరం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి జనం పెద్ద ఎత్తున తరలిరావడంతో నగరంలోని మెయిన్ రోడ్డు, కోటగుమ్మం సెంటర్, సీతమ్మ సందు వంటి ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. వీటితో పాటు హోల్‌సేల్ క్లాత్ మార్కెట్‌లైన మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో రద్దీ నెలకొంది. దుస్తులతో పాటు వివిధ రకాల గాజులు, చెప్పులు, షూస్, బెల్టులు, వాచీలు, బ్యాగులు కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలోనే వ్యాపారులు పండగకు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు.

డ్రాలో ఖరీదైన కార్లు, బంగారు నక్లెస్‌లు

వస్త్రాల కొనుగోలుపై పలు కార్పొరేట్ సంస్థలు పోటాపోటీగా ఆఫర్లు ప్రకటించడంతో పాటు లక్కీ డ్రాలో ఖరీదైన కార్లు, బంగారు నక్లెస్‌లు, గృహోపకరణలను బహుమతులుగా అందజేస్తున్నాయి. దీంతో జనం షాపింగ్ మాల్స్‌కు క్యూకడుతున్నారు.


అమ్మకానికి సిద్ధం చేసిన షూస్

కొన్ని వ్యాపార సంస్థలు ఎలక్ట్రానిక్ వస్తువులపై కూడా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించాయి. స్మార్ట్ టీవీలు, సెల్ ఫోన్లు, రకరకాల గాడ్జెట్స్‌పై ఆఫర్లు పెట్టి యువతను ఆకర్షిస్తున్నాయి.

రోడ్డు పక్కనే పార్కింగ్

పండగ షాపింగ్ కోసం జనం పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లతో మెయిన్ రోడ్డు చుట్టుప్రక్కల ప్రాంతాలైన కోటగుమ్మం సెంటర్, టౌన్ హాలు రోడ్డు, నల్లమందు సందు వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. వాహనాలు ఎక్కడిక్కడ నిలిచిపోవడంతో షాపింగ్‌కు వచ్చిన జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీటికి తోడు పలు ప్రదేశాల్లో సరియైన పార్కింగ్ లేకపోవడంతో పాటు, షాపింగ్ మాల్స్‌కు వచ్చే వాహనాలను సైతం రోడ్డు పక్కనే నిలిపి వేస్తున్నారు.

బదిలీల్లో గందరగోళం

కంబాలచెరువు: బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో గందరగోళం ఉందని, ఈ నేపథ్యంలో వెంటనే వర్క్ ఎడ్జస్ట్‌మెంట్ ప్రక్రియను వాయిదా వేయాలని ప్యాక్టో ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూలు వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ప్యాక్టో) నాయకులు మాట్లాడుతూ అస్పష్టతగా ఉన్న ఉత్తర్వుల కారణంగా కౌన్సెలింగ్‌ను వాయిదా వేయాలన్నారు. సంక్రాంతి సెలవుల అనంతరం ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలన్నారు.

పాలకమండలి సభ్యుడిగా షేక్ మీరా

రాజానగరం: ఆలిండియా అసోసియేషన్ ఆఫ్ స్పెషల్ లైబ్రేరియన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెంటర్స్ జోన్–1కి ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్నాటక, పాండచ్చేరి, లక్షదీప్‌ల నుంచి పాలక మండలి సభ్యుడిగా గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ లైబ్రేరియన్ షేక్ మీరాను ఎంపిక చేశారు. ఆయన 2025 వరకు ఈ పదవిలో కొనసాగుతారు.

31 వరకూ ఉచిత వైద్య సేవలు

రాజానగరం: స్థానిక జీఎస్‌ఎల్ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న జనరల్ ఆస్పత్రిలో ఈ నెల 31 వరకు కొన్ని రకాల వ్యాధులకు ఉచిత వైద్య సేవలు అందించనున్నామని కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పిడియాట్రిక్స్, పల్మనాలజీ, ఆర్థోపెడిక్స్ విభాగాలలో ఉచిత సేవలు లభిస్తాయన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు లేనివారు కూడా వినియోగించుకోవచ్చని, అయితే వారు అవసరమైన మందులు, ఇంప్లాట్ల ఖర్చును భరించాలన్నారు.

జూదాలు అరికట్టాలని వినతి

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలని గ్రామ సర్పంచ్ సబ్బారపు పద్మావతి అధికారులకు వినతిప్రతం అందించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో గొడవలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో సంక్రాంతి సందర్భంగా కేవలం కోడిపందేలు, పేకాట, గుండాట, నంబర్ బోర్డులు వంటి ఆటలు జరగకుండా చూడాలన్నారు. దీనిపై పంచాయతీ తీర్మానం చేసిన కాపీని తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. ఉప సర్పంచ్ పడాల వెంకట రామారెడ్డి పాల్గొన్నారు.

సేవలు స్ఫూర్తిదాయకం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి సొసైటీ (పీఏసీఎస్) సేవా కార్యక్రమాలకు స్ఫూర్తిగా నిలిచిందని వ్యవసాయ సలహామండలి చైర్మన్ క్రొవ్విడి సత్రాజు అన్నారు. శుక్రవారం సొసైటీ చైర్మన్ బుడ్డిగ సత్తిబాబు, సీఈఓ ఈదల సుదర్శనరావు ఆధ్వర్యంలో కళ్లజోళ్ల పంపిణీ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సత్రాజు చేతుల మీదుగా 90 మందికి కళ్లజోళ్లు అందజేశారు. ఇటీవల ఏలూరుకు చెందిన ఆశ్రమ హాస్పటల్ ఆధ్వర్యంలో కంటి శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రోత్సాహంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అవసరమైన 11 మందికి శస్త్ర చికిత్స, మరికొందరికి మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కంటే సత్తిబాబు, ఏవీఎస్‌ఎన్ మూర్తి, మేకా నెహ్రూరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యాపురం బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం


ప్రసాదరావు విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఆర్యాపురం బ్యాంక్ చైర్ పర్సన్ తులసి, డైరెక్టర్లు

ప్రకాశం నగర్: ఆర్యాపురం కో ఆపరేటివ్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం గోకవరం బస్టాండ్ వద్ద గల బ్యాంక్ ప్రధాన కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. సరిపిల్ల విశ్వేశ్వర ప్రసాదరావు నెలకొల్పిన ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 104 వసంతాలు పూర్తి చేసుకుని 105వ వసంతం లోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా ప్రసాదరావు విగ్రహానికి బ్యాంక్ చైర్ పర్సన్ గిరజాల రామకృష్ణ తులసి, పాలకవర్గ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సువర్ణ సరిపెల్ల గోల్డ్ లోన్ స్కీమును ప్రారంభించారు. చైర్ పర్సన్ రామకృష్ణ తులసి మాట్లాడుతూ ఏప్రిల్ 27 వరకు 105 రోజుల పాటు ఈ స్కీమ్ అమల్లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సెక్రటరీ కె.స్వరాజ్యలక్ష్మి, డైరెక్టర్లు మజ్జి నూకరత్నం, మార్గాని సురేష్, నక్కెళ్ల బాబూరావు, పెంకె సురేష్ కుమార్, యర్రా ప్రసాదరావు, పత్తివాడ రమేష్ బాబు, రాయుడు గణేష్, వీణం వెంకటేశ్వరరావు, లీలా గంగాధరరావు, వెంట్రపాటి సురేష్ పాల్గొన్నారు.

బిషప్ థామస్ సేవలు అభినందనీయం


శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి వనిత, ఎంపీ భరత్ రామ్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో బిషప్ థామస్‌కు సాటి మరొకరు లేరని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. శుక్రవారం కాతేరులోని దహించు అగ్ని మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు బిషప్ థామస్ నూతన చర్చి నిర్మాణం, అనాథ పిల్లలు, వితంతువుల కోసం నిర్మించే నూతన భవనాల సముదాయానికి శంకుస్థాపన చేశారు. రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, దహించు అగ్ని మినిస్ట్రీస్ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా జగన్ పాలన

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- మునగాలలో గడప గడపకూ


మునగాలలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగుతోందని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మునగాల గ్రామంలో ఐదో రోజు శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్త మునగాల రామాలయం వీధి నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో తొలుత శ్రీరామచంద్రమూర్తిని దర్శించుకున్నారు. గ్రామంలోని గడప గడపకూ తిరుగుతూ వారికందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. గ్రామంలోని 200 గడపలు తిరిగారు.

గ్రామంలో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ గ్రామానికి ప్రభుత్వం మూడేళ్ల కాలంలో రూ.7 కోట్లు నిధులు కేటాయించిందన్నారు. దానిలో భాగంగానే అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. గ్రామంలో నాడు–నేడు పథకంతో పాఠశాల అభివృద్ధి, సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్, మంచినీటి ట్యాంకు. శ్మశాన వాటిక అభివృద్ధి తదితర పనులు నిర్వహించామన్నారు. స్థానికులు చెప్పిన ఇళ్ల స్థలాలు, తాగునీరు, సాగునీరు సమస్యలను పరిష్కరిస్తానన్నారు. రబీ పంటకు బురద కాలువ నీరివ్వాలన్న రైతన్నల కోరిక మేరకు సాగునీటి శాఖ డీఈతో ఫోన్‌లో మాట్లాడి నీరందించాలని ఆదేశించారు. అలాగే జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు త్వరలో ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, మునగాల ఎంపీటీసీ సభ్యుడు చింతాకుల లోవరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు గిద్దా సత్యనారాయణ, మండపాక కోటేశ్వరరావు, వెంకటపతి, సీతారాముడు, నాగులాపల్లి పెద్ద వెంకన్న, ఫణికుమార్ పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ

రంగంపేట: మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. వడిశలేరు ఎన్టీఆర్ విగ్రహం నుంచి రంగంపేటలోని ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ జరిగింది. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలన్నారు.

పండగ వెలుగులు



తెలుగువారి పెద్ద పండగను ఘనంగా జరుపుకొనేందుకు ప్రజలు సమాయత్తమయ్యారు. ఇందులో భాగంగా భోగి పండగకు శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఘనంగా స్వాగతం పలికారు. రాజమహేంద్రవరం కంబాలచెరువు సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద వాసు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో భోగిమంట వెలిగించారు.
– ఫొటో: గరగ ప్రసాద్

దిశ ముగ్గుకు అధికారుల ప్రశంసలు

కడియం: దిశ యాప్‌తో కష్టాల్లో ఉన్న యువతులు, మహిళలకు సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటున్న విషయం విదితమే. దిశ యాప్ ద్వారా మహిళలకు అందిస్తున్న సేవలను ముగ్గుగా వేసిన కడియం పోలీసు మహిళా కానిస్టేబుళ్లు ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డులు, కానిస్టేబుల్, ఎస్‌ఐ, సీఐ తదితర మహిళా సిబ్బందికి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కడియం పోలీస్ స్టేషన్‌కు చెందిన మహిళా పోలీసు కానిస్టేబుల్ వీఎల్‌జీ భవానీ దిశ యాప్ లక్ష్యాలు, ప్రయోజనాలను తెలియజేస్తూ ఆకర్షణీయంగా ముగ్గు వేశారు. ఈ ముగ్గు అడిషనల్ ఎస్పీ రజనీ, దక్షిణ మండలం డీఎస్పీ ఎం.శ్రీలత తదితర పోలీసు ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకుంది. కడియం పోలీసు స్టేషన్ నుంచి ఎస్‌ఐ అమీనాబేగం, ఐదుగురు మహిళా సిబ్బంది ఈ పోటీల్లో పాల్గొన్నారు.

దిశ ముగ్గు వద్ద కడియం మహిళా కానిస్టేబుళ్లు →



సాక్షి బిజినెస్
శనివారం
14-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 303	నిఫ్టీ ▲ 98
60,261	17,957

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫన్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,978	▽	23
డోజోన్స్	34,193	▲	3
ఎఫ్‌టీఎస్ఈ 100	7,844	▲	50
డాక్స్	15,087	▲	28
షాంఘై	3,195	▲	31
నికాయ్	26,120	▽	330

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	56,462	▲	352
బంగారం (99.5 స్వచ్ఛత)	56,236	▲	351
వెండి (కిలో)	68,115	▲	90

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	కాయినేజ్	79.50	83.18
£	బ్రిటన్ పౌండ్	కాయినేజ్	96.84	101.69
€	యూరో	కాయినేజ్	85.71	90.23
¥	జపాన్ ఎన్ (100)	కాయినేజ్	50.00	76.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	కాయినేజ్	54.20	59.09
S$	సింగపూర్ డాలర్	కాయినేజ్	59.21	63.76
SAR	సౌదీ రియాల్	కాయినేజ్	20.69	22.36
UAE D	యూఏఈ దిర్హామ్	కాయినేజ్	21.25	23.04
¥	చైనా యువాన్	కాయినేజ్	10.98	13.01

డిజిటల్ వినియోగానికి ఎదురుదెబ్బ: గూగుల్

న్యూఢిల్లీ: గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందంటూ కాంపిటీషన్ కమిషన్ (సీసీఐ) తమకు జరిమానా విధించడంపై టెక్ దిగ్గజం గూగుల్ స్పందించింది. కనెక్టివిటీకి అడ్డంకులను తొలగించే దిశగా సురక్షితమైన స్మార్ట్‌ఫోన్లను అందుబాటులోకి తేవాల్సిన దశలో ఇలాంటి ఆదేశాలు ఇవ్వడం వల్ల దేశీయంగా డిజిటల్ వినియోగం వేగవంతం కాకుండా విఘాతం కలుగుతుందని వ్యాఖ్యానించింది. గూగుల్ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టం విషయంలో గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందంటూ రూ. 1,338 కోట్లు, ప్లే స్టోర్‌కి సంబంధించి అనుచిత విధానాలపై మరో రూ. 936 కోట్ల మొత్తాన్ని సీసీఐ జరిమానా విధించిన సంగతి తెలిసిందే.

క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ నుంచి వరి సంరక్షణా పురుగు మందు

హైదరాబాద్: వరి పంట రక్షణ, రైతులకు లాభదాయకత పెంపు లక్ష్యంగా క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ సంస్థ మార్కెట్లోకి సరికొత్త పురుగుమందును ఆవిష్కరించింది. పంట సమయంలో చీడపీడలను నియంత్రించడమే కాకుండా, వరి పంట మొత్తాన్ని సురక్షితంగా ఉంచడానికి, దిగుబడిని పెంచడానికి, నాణ్యమైన ఉత్పత్తికి 'మెంటార్' పేరుతో విడుదలైన ఈ ప్రొడక్ట్ దోహదపడుతుందని ఈ మేరకు వెలువడిన ఒక ప్రకటన వివరించింది. దేశవ్యాప్తంగా వివిధ అగ్రి విశ్వవిద్యాలయాలలో మెంటర్‌ను పరీక్షించడం జరిగిందని ప్రకటన తెలిపింది. వరి పంట విషయంలో చీడపీడలను అరికట్టడంలో ఇది ప్రభావవంతంగా పనిచేస్తున్నట్లు పేర్కొంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో)

14-1-2023	
విశాఖ	572-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	563-00
విజయవాడ	563-00
రిటైల్ ధర (డజను)	84.00
13-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	563-00
వరంగల్	565-00
రిటైల్ ధర	6.20

విప్రో లాభం రూ. 3,053 కోట్లు

- క్యూ3 ఫలితాల విడుదల
- ఆదాయం రూ. 23,229 కోట్లు
- 4.3 బిలియన్ డాలర్ల ఆర్డర్లు
- 2,58,744కు మొత్తం సిబ్బంది

న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం విప్రో లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 2.8 శాతం బలపడి రూ. 3,053 కోట్లను తాకింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 2,969 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 14 శాతం ఎగసి రూ. 23,229 కోట్లకు చేరింది. మార్చితో ముగియనున్న పూర్తి ఏడాదికి ఐటీ సర్వీసుల ఆదాయం 11.5-12 శాతం మధ్య పుంజుకోనున్నట్లు తాజాగా అంచనా(గైడెన్స్) ప్రకటించింది. వాటాదారులకు షేరుకి రూ. 1 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. ఈ ఏడాది క్యూ2(జూలై-సెప్టెంబర్)తో పోలిస్తే నికర లాభం 15 శాతం, ఆదాయం 3 శాతం వృద్ధి చూపాయి.



ఫలితాలను ప్రకటిస్తున్న విప్రో సీఈవో, ఎండీ థియరీ డెలాపోర్ట్

డీల్స్ రికార్డ్..

ప్రపంచ అనిశ్చితుల్లోనూ క్యూ3లో రికార్డ్ నెలకొల్పుతూ మొత్తం 4.3 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకున్నట్లు విప్రో సీఈవో, ఎండీ థియరీ డెలాపోర్ట్ పేర్కొన్నారు. ఇది 26 శాతం వృద్ధికాగా.. వీటిలో బిలియన్ డాలర్ల విలువకు మించిన భారీ ఆర్డర్లను సైతం పొందినట్లు తెలియజేశారు. క్యూ4(జనవరి-మార్చి)లోనూ ఇదే స్థాయి ఆర్డర్లు పొందే వీలున్నట్లు అంచనా వేశారు. క్లయింట్లతో లోతైన సంబంధాల ద్వారా అత్యధిక స్థాయిలో డీల్స్ కుదుర్చుకోగలుగుతున్నట్లు వివరించారు. ట్రాన్స్‌ఫార్మేషన్ లక్ష్యాలు, వ్యయ క్రమబద్ధీకరణ తదితర అంశాలలో క్లయింట్లకు అందిస్తున్న సమర్థవంత సేవలు ఇందుకు దోహదపడుతున్నట్లు తెలియజేశారు. పూర్తిస్థాయి క్లౌడ్ సర్వీసులు, ఇంజనీరింగ్ సర్వీసులు ఆర్డర్‌బుక్‌కు దన్నుగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇతర హైలైట్స్

- క్యూ2తో పోలిస్తే విప్రో ఉద్యోగుల సంఖ్య నికరంగా 435 తగ్గి 2,58,744ను తాకింది.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 1.8 శాతం తగ్గి 21.2 శాతానికి చేరింది.
- ఐటీ సర్వీసుల నిర్వహణ మార్జిన్లు 1.2 శాతం బలపడి 16.3 శాతానికి చేరాయి.
- ఐటీ సర్వీసుల ఆదాయం 6.2 శాతం వృద్ధితో 280.35 కోట్ల డాలర్లను తాకింది.
- ఐటీ ప్రొడక్టుల ఆదాయం 2.08 కోట్ల డాలర్లు(రూ. 170 కోట్లు)గా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో విప్రో షేరు యథాతథంగా రూ. 396 వద్ద ముగిసింది.

3 రోజుల నష్టాలకు చెక్

ముంబై: ద్రవ్యోల్బణ ఆందోళనలు ఉపశమించిన నేపథ్యంలో మూడు రోజుల వరుస నష్టాలకు చెక్ పడింది. మెటల్, ఫైనాన్షియల్స్, ఐటీలో కొనుగోళ్లు దేశీ స్టాక్ మార్కెట్లు జోష్‌నిచ్చాయి. వెరసి సెన్సెక్స్ ట్రిపుల్ సెంచరీ చేసి 60,000 మార్క్‌ను అధిగమించింది. 303 పాయింట్లు జమ చేసుకుని 60,261 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 98 పాయింట్లు ఎగసి 17,957 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 460 పాయింట్లు జంప్‌చేయగా.. నిఫ్టీ 18,000 స్థాయికి చేరువైంది. అయితే తొలుత మార్కెట్లు నష్టాలతో ప్రారంభమయ్యాయి. తదుపరి ట్రేడర్లు షార్ట్ కవరింగ్ చేపట్టడంతో మిడ్ సెషన్ నుంచీ జోరందుకున్నట్లు విశ్లేషకులు తెలియజేశారు.

కన్జూమర్ డ్యూరబుల్స్ వీక్

ఎన్ఎస్ఈలో ప్రధానంగా మెటల్, బ్యాంకింగ్, ఐటీ, ఆటో రంగాలు 1.3-0.6 శాతం మధ్య పుంజుకోగా... కన్జూమర్ డ్యూరబుల్స్ 1 శాతం నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్, ఇండస్ఇండ్, ఐషర్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, దివీస్, హీరో మోటో, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్, బీపీసీఎల్, ఐసీఐసీఐ, హెచ్‌యూఎల్, టీసీఎస్, ఎయిర్‌టెల్, మారుతీ, ఎస్‌బీఐ 2-1 శాతం మధ్య బలపడ్డాయి. అయితే టైటన్, ఎస్‌బీఐ లైఫ్, అపోలో హాస్పిటల్స్, నెస్లే, ఎల్అండ్‌టీ 1-0.5 శాతం మధ్య క్షీణించాయి.



స్టాక్ హైలైట్స్

- క్యూ3లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 716 కోట్ల అమ్మకాలు సాధించినట్లు వెల్లడించడంతో రియల్టీ కంపెనీ కోల్టేపాటిల్ డెవలపర్స్ 16% దూసుకెళ్లింది. రూ. 303 వద్ద ముగిసింది. తొలుత రూ. 312ను సైతం అధిగమించింది.
- చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టు నుంచి తాజాగా రూ. 1,134 కోట్ల విలువైన ఆర్డర్ పొందడంతో రైల్ వికాస్ నిగమ్(ఆర్‌వీఎన్ఎల్) కౌంటర్ 5 శాతం ఎగసి రూ. 80 వద్ద ముగిసింది.
- కొద్ది రోజులుగా ర్యాలీ బాటలో సాగుతున్న ఆర్కియన్ కెమికల్స్ షేరు మరోసారి 8 శాతం జంప్‌చేసి రూ.617 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ.629 వద్ద కొత్త గరిష్టాన్ని తాకింది.

ప్రభుత్వ, ప్రైవేటు రంగం కలసి పనిచేయాలి

- అవకాశాలను సొంతం చేసుకోవాలి
- ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- బడ్జెట్‌కు ముందు ఆర్థికవేత్తలతో చర్చలు

న్యూఢిల్లీ: ప్రభుత్వ, ప్రైవేటు రంగం కలసికట్టుగా పనిచేయాలని, అంతర్జాతీయంగా ఉన్న పరిణామాల నేపథ్యంలో తమ పరిధి దాటి విశాల దృక్పథంతో ఆలోచించి అవకాశాలను సొంతం చేసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌కు ముందు ప్రముఖ ఆర్థికవేత్తలతో శుక్రవారం ప్రధాని సమావేశమయ్యారు. వారి అభిప్రాయాలు, సూచనలను తెలుసుకున్నారు. డిజిటల్ కార్యకలాపాల విషయంలో, ఫిన్‌టెక్ విస్తరణలో దేశం సాధించిన విజయాన్ని ప్రధాని ఈ సందర్భంగా ప్రశంసించినట్టు అధికారికంగా ఓ ప్రకటన విడుదలైంది. సమ్మిళిత వృద్ధికి ఇది కీలకమని ప్రధాని అభిప్రాయపడ్డారు. భారత్ వృద్ధిలో మహిళల పాత్ర కీలకమని పేర్కొంటూ, ఉత్పాదకతలో మహిళలను మరింతగా భాగస్వాములను చేయాలని కోరారు. రిస్కులు ఉన్నప్పటికీ అంతర్జాతీయంగా డిజిటైజేషన్, ఇంధనం, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం రంగాల్లో విస్తతమైన అవకాశాలున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. ఈ అవకాశాలను సొంతం చేసుకునేందుకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు కలసి పనిచేయాలని పిలుపునిచ్చారు. భారత్ తన వృద్ధిని స్థిరంగా కొనసాగించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ఆర్థికవేత్తలు ఈ సమావేశంలో ప్రధానికి సూచించినట్టు ప్రభుత్వ ప్రకటన తెలిపింది. అంతర్జాతీయంగా ప్రస్తుతం నెలకొన్న సమస్యలు కొనసాగుతాయంటూ, భారత్ మరింత బలమైన వృద్ధిని నమోదు చేసేందుకు చర్యలను ప్రతిపాదించినట్టు పేర్కొంది. ఈ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ, ఉన్నతాధికారులతోపాటు.. ఆర్థికవేత్తలు శంకర్ ఆచార్య, అశోక్ గులాటీ, షమిక రవి తదితరులు పాల్గొన్నారు.



ఇతర రంగాలకూ పీఎల్ఐ స్కీమ్

- రానున్న సంవత్సరాల్లో వచ్చే చాన్స్
- బడ్జెట్‌లో డిమాండ్ బలోపేతానికి చర్యలు
- పరిశ్రమ వర్గాల ఆశాభావం

న్యూఢిల్లీ: ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం ఎంతో ప్రయోజనకరమని మెజారిటీ వ్యాపారవేత్తలు భావిస్తున్నారు. రానున్న రోజుల్లో పీఎల్ఐ కింద ఇతర రంగాలకూ ప్రోత్సాహకాలు లభిస్తాయన్న ఆశాభావం వారి నుంచి వ్యక్తమైంది. డిమాండ్ బలోపేతానికి వీలుగా బడ్జెట్‌లో ప్రకటించే చర్యలు అన్ని రంగాల్లో వృద్ధికి ఊతంగా నిలుస్తాయన్న అభిప్రాయం కంపెనీల ప్రతినిధుల్లో వ్యక్తమైంది. మూలధన వ్యయాలపైనా బడ్జెట్ దృష్టి సారిస్తుందని అంచనా వేస్తున్నారు. డెలాయిట్ సర్వే వివిధ రంగాల్లోని పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను తెలుసుకుంది. మూలధన వ్యయాలు, మౌలిక సదుపాయాలకు రుణాలను అందించడం వృద్ధికి కీలకమన్న అభిప్రాయం వ్యక్తమైంది. భారత ప్రభుత్వ బాండ్ల ద్వారా నిధులు సమీకరించాలని సర్వేలో 60 శాతం మంది సూచించారు. రానున్న బడ్జెట్ నుంచి పరిశ్రమ ఏమి ఆశిస్తుందో తెలుసుకునే ప్రయత్నం సర్వేలో భాగంగా డెలాయిట్ చేసింది. 10 రంగాల నుంచి 181 మంది ప్రతినిధులు సర్వేలో పాల్గొని అభిప్రాయాలు తెలియజేశారు.



పారిశ్రామికవేత్తల అభిప్రాయాలు

- 70 శాతానికి పైగా పరిశ్రమల ప్రతినిధులు పీఎల్ఐ పథకం తమ రంగం వృద్ధికి మేలు చేస్తుందని చెప్పారు.
- 60% మంది పీఎల్ఐ ప్రోత్సాహకాలను మరిన్ని రంగాలకు ప్రకటిస్తారని ఆశిస్తున్నారు.
- పన్నుల్లో మార్పులు తెస్తే అది పరిశ్రమల వృద్ధికి ప్రయోజనం కలిగిస్తుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. రానున్న బడ్జెట్‌లో ఎక్కువ మంది బలంగా దీన్ని కోరుకుంటున్నారు.
- ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు పెట్టుబడుల వృద్ధికి దోహదం చేస్తాయని భావిస్తున్నారు.
- ఎంఎస్ఎంఈలను జీవీసీ కిందకు తీసుకొస్తే పరిశ్రమల వృద్ధి స్థిరత్వానికి సాయపడుతుందని, వాణిజ్య లావాదేవీలు పెరుగుతాయని చెప్పారు.
- 45 శాతం మంది పన్ను బాధ్యతలను ప్రభుత్వం తగ్గిస్తుందని అంచనా వేస్తుంటే, 44 శాతం మంది టీడీఎస్‌కు సంబంధించి స్పష్టత కోరుకుంటున్నారు.
- మూలధన లాభాల పన్ను నిర్మాణాన్ని మరింత సులభతరంగా మార్చాలని పరిశ్రమ కోరుతోంది.
- కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 14 రంగాలకు పీఎల్ఐ కింద రూ. 2 లక్షల కోట్ల ప్రోత్సాహకాలను ప్రకటించింది. తోలు, సైకిల్, టీకాల తయారీ, టెలికం ఉత్పత్తులకు పీఎల్ఐ విస్తరణ ప్రతిపాదన పరిశీలనలో ఉంది.



నేటి నుంచి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీ

దక్షిణాఫ్రికా వేదికగా నేటి నుంచి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ జరగనుంది. 16 జట్లు తలపడుతున్న ఈ టోర్నీ ఈనెల 29న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. గ్రూప్ 'ఎ'లో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, శ్రీలంక, అమెరికా; గ్రూప్ 'బి'లో ఇంగ్లండ్, పాకిస్తాన్, జింబాబ్వే, రువాండా; గ్రూప్ 'సి'లో ఇండోనేసియా, ఐర్లాండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్; గ్రూప్ 'డి'లో భారత్, దక్షిణాఫ్రికా, స్కాట్లాండ్, యూఏఈ జట్లున్నాయి. నేడు జరిగే తమ తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ ఆడుతుంది. భారత జట్టులో హైదరాబాద్ అమ్మాయి గొంగడి త్రిష, వైజాగ్‌కు చెందిన షబ్నమ్ సభ్యులుగా ఉన్నారు.

టెన్నిస్‌కు సానియా గుడ్‌బై

వచ్చే నెలలో రిటైర్ కానున్న భారత స్టార్

మెల్‌బోర్న్: భారత వెటరన్ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా ఫిబ్రవరిలో జరిగే దుబాయ్ ఓపెన్ తర్వాత రిటైర్ అవుతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆమె ట్విట్టర్‌లో భావోద్వేగపు లేఖను 'లైఫ్ అప్‌డేట్' అనే క్యాప్షన్‌తో పంచుకుంది. మూడు పేజీల ఈ లేఖలో తన 30 ఏళ్ల రాకెట్ పయనాన్ని, చివరి గమ్యాన్ని వివరించింది. 'నా గ్రాండ్‌స్లామ్ ప్రయాణం 2005లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌తోనే మొదలైంది. ఇప్పుడు గ్రాండ్‌స్లామ్ ఆట కూడా అక్కడే ముగించేందుకు సరైన వేదిక అనుకుంటున్నా. 18 ఏళ్ల క్రితం ఎక్కడైతే ఆరంభించానో అక్కడే ఆపేయబోతున్నా. ఇక కెరీర్‌లో చివరి టోర్నీ మాత్రం దుబాయ్ ఓపెన్. ఫిబ్రవరిలో ఈ టోర్నీతో సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతాను. ఇన్నేళ్ల పయనంలో ఎన్నో ఆటుపోట్లే కాదు మరెన్నో మధురస్మృతులూ ఉన్నాయి' అని అందులో పేర్కొంది. నాసర్ స్కూల్‌కు చెందిన ఆరేళ్ల బాలిక ఎలా టెన్నిస్ నేర్చుకుంది... తన కలలకు ఎక్కడ బీజం పడింది... అన్నింటికీ మించి దేశానికి ప్రాతినిధ్యం ఎలాంటి స్ఫూర్తినిచ్చిందో ఆ లేఖలో చెప్పుకొచ్చింది. అర్ధ సెంచరీని దాటిన తన గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో గెలిచిన కొన్ని టైటిళ్లు దేవుడిచ్చిన వరమంది. 'నా సుదీర్ఘ కెరీర్‌లో దేశానికి పతకాలు తేవడమే అతిపెద్ద గౌరవంగా భావిస్తాను. పతకం నా మెడలో పడినపుడు జాతీయ పతాకం రెపరెపలాడినపుడు కలిగే ఆనందం అన్నింటికి మించి ఉంటుంది. ఇప్పుడు దీన్ని తలచుకొని రిటైర్మెంట్ సందేశం రాస్తున్నప్పుడు చెరిగిపోని ఆ అనుభూతి నా కళ్లను చెమరుస్తోంది' అని 36 ఏళ్ల సానియా పేర్కొంది.



భారత్ శుభారంభం

నాలుగోసారి ప్రపంచకప్ పురుషుల హాకీ టోర్నీకి ఆతిథ్యమిస్తున్న భారత జట్టు ఆనవాయితీని కొనసాగించింది. స్వదేశంలో జరిగిన గత మూడు ప్రపంచకప్‌లలో భారత జట్టు తాము ఆడిన తొలి మ్యాచ్‌లో విజేతగా నిలిచింది. నాలుగోసారీ ఈ ఫలితంలో మార్పు లేకుండా చూసుకున్న టీమిండియా ఈ మెగా ఈవెంట్‌లో శుభారంభం చేసింది. 48 ఏళ్లుగా ఊరిస్తున్న ప్రపంచకప్ టైటిల్ వేటను విజయంతో మొదలుపెట్టింది.

- తొలి మ్యాచ్‌లో స్పెయిన్‌పై 2-0తో విజయం
- ప్రపంచకప్ హాకీ టోర్నీ

రూర్కెలా (ఒడిశా): సొంతగడ్డపై తమ సత్తా చాటుకుంటూ భారత పురుషుల హాకీ జట్టు ప్రపంచకప్ టోర్నీలో బోణీ కొట్టింది. స్పెయిన్ జట్టుతో శుక్రవారం జరిగిన పూల్ 'డి' తొలి లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత జట్టు 2-0 గోల్స్ తేడాతో గెలుపొందింది. ఆట 12వ నిమిషంలో వైస్ కెప్టెన్ అమిత్ రోహిదాస్... 26వ నిమిషంలో హార్దిక్ సింగ్ ఒక్కో గోల్ సాధించి భారత విజయంలో కీలకపాత్ర పోషించారు. ఆద్యంతం భారత్ ఆధిపత్యం చలాయించిన ఈ మ్యాచ్‌లో టీమిండియాకు ఐదు పెనాల్టీ కార్నర్‌లు రాగా... స్పెయిన్ మూడు పెనాల్టీ కార్నర్‌లు సంపాదించింది. భారత్ ఐదు పెనాల్టీ కార్నర్‌లలో ఒక దానిని సద్వినియోగం చేసుకోగా... స్పెయిన్ మూడింటినీ వృథా చేసుకుంది. ఆదివారం జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో భారత్ ఆడుతుంది.

స్పెయిన్‌తో మ్యాచ్‌లో భారత్ సంపూర్ణ ఆధిపత్యాన్ని కనబరిచింది. అవకాశం దొరికినపుడల్లా భారత ఆటగాళ్లు నీలకంఠ శర్మ, మన్‌దీప్ సింగ్, ఆకాశ్‌దీప్ సింగ్, అభిషేక్ గోల్‌పోస్ట్‌పై దాడులు చేసినా స్పెయిన్ అప్రమత్తంగా ఉంటూ వాటిని నిలువరించింది. లేదంటే భారత్ ఖాతాలో మరిన్ని గోల్స్ చేరేవి. 12వ నిమిషంలో లభించిన రెండో పెనాల్టీ కార్నర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ డ్రాగ్ ఫ్లిక్ చేయగా... బంతి స్పెయిన్ డిఫెండర్‌కు తగిలి వెనక్కి వచ్చింది. అక్కడే ఉన్న అమిత్ రోహిదాస్ బంతిని లక్ష్యానికి చేర్చడంతో భారత్ ఖాతా తెరిచింది. అనంతరం 26వ నిమిషంలో ఎడమ వైపు నుంచి హార్దిక్ సింగ్ దూసుకొస్తూ అదే జోరులో క్రాస్ షాట్‌తో బంతిని స్పెయిన్ గోల్‌పోస్ట్‌లోనికి పంపించాడు. దాంతో భారత ఆధిక్యం 2-0కు పెరిగింది. మూడో క్వార్టర్‌లో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్‌ను వృథా చేయడం గమనార్హం. తొలి రోజు జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో పూల్ 'ఎ'లో అర్జెంటీనా 1-0తో దక్షిణాఫ్రికాపై... మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా 8-0తో ఫ్రాన్స్‌పై గెలుపొందగా... పూల్ 'డి'లోని మరో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 5-0తో వేల్స్ జట్టును ఓడించింది.



8 ప్రపంచకప్ టోర్నీలలో తాము ఆడిన తొలి మ్యాచ్ లో భారత్ గెలుపొందడం ఇది ఎనిమిదో సారి. 15వసారి ప్రపంచకప్ జరుగుతుండగా... భారత్ రెండుసార్లు తమ తొలి మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని, ఐదుసార్లు తమ తొలి మ్యాచ్‌లో ఓడిపోయింది.

సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ ద్వయం 17-21, 22-20, 21-9తో లియు యు చెన్-జువాన్ యి ఒయు (చైనా) జోడీపై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ ప్రణయ్ 16-21, 21-19, 12-21తో ప్రపంచ ఏడో ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో ఓడిపోయాడు. ప్రణయ్‌కు 6,875 డాలర్ల (రూ. 5 లక్షల 60 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 6,600 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఆంధ్ర జట్టుకు నిరాశ

ఢిల్లీకి తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

న్యూఢిల్లీ: చివరి వికెట్ తీయడంలో విఫలమైన ఆంధ్ర జట్టు బౌలర్లు ఢిల్లీ జట్టుతో జరిగిన రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కోల్పోయారు. మ్యాచ్ 'డ్రా'గా ముగిసినా 29 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించినందుకు ఢిల్లీ జట్టుకు మూడు పాయింట్లు లభించగా... ఆంధ్ర ఖాతాలో ఒక పాయింట్ మాత్రమే చేరింది. ఓవర్‌నైట్ స్కోరు 300/4తో ఆట చివరిరోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఢిల్లీ జట్టు 9 వికెట్లకు 488 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్లలో ధ్రువ్ షోరే మరో 43 పరుగులు జోడించి వ్యక్తిగత స్కోరు 185 వద్ద అవుటవ్వగా... హిమ్మత్ సింగ్ (104; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. హిమ్మత్ సింగ్ అవుటైనపుడు ఢిల్లీ స్కోరు 423/9. చివరి వికెట్ తీసిఉంటే ఆంధ్ర జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతోపాటు మూడు పాయింట్లు లభించేవి. కానీ ఢిల్లీ బ్యాటర్లు హర్షిత్ రాణా (46 బంతుల్లో 33 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), దివిజ్ మెహ్రా (38 బంతుల్లో 32 నాటౌట్; 6 ఫోర్లు) మొండి పట్టుదలతో ఆడి చివరి వికెట్‌కు అజేయంగా 65 పరుగులు జోడించారు. ఐదు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఆంధ్ర గ్రూప్ 'బి' 13 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది.



భారత టెస్టు జట్టులోకి సూర్యకుమార్

- ఇషాన్ కిషన్‌కు తొలిసారి పిలుపు
- ఆసీస్‌తో తొలి రెండు టెస్టులకు జట్టు ప్రకటన

ముంబై: ఆస్ట్రేలియాతో సొంతగడ్డపై జరిగే 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లోని తొలి రెండు టెస్టుల కోసం 17 మంది సభ్యులతో భారత జట్టును సెలక్టర్లు ప్రకటించారు. టి20లో తన విధ్వంసక ఆటతో చెలరేగుతున్న సూర్యకుమార్ యాదవ్ తొలిసారి టెస్టు టీమ్‌లోకి ఎంపికయ్యాడు. ఇప్పటి వరకు టెస్టుల్లో అవకాశం రాకపోయినా ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లోనూ సూర్యకు మంచి రికార్డే ఉంది. 79 మ్యాచ్‌లలో అతను 44.75 సగటుతో 5549 పరుగులు చేయగా, ఇందులో 14 సెంచరీలు ఉన్నాయి. మరోవైపు కారు ప్రమాదానికి గురైన వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఇప్పట్లో కోలుకునే అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నాయ వికెట్ కీపర్‌గా ఇషాన్ కిషన్‌ను ఎంపిక చేశారు. ఆంధ్ర ఆటగాడు కోన శ్రీకర్ (కేఎస్) భరత్ ఇప్పటికే టెస్టు టీమ్‌తో ఉండగా (ఇంకా మ్యాచ్ ఆడలేదు), కిషన్‌కు టెస్టుల్లో ఇదే తొలి అవకాశం. బుమ్రాను ఎంపిక చేయకపోవడంతో అతను పూర్తిగా కోలుకోలేదని తేలింది. గాయం నుంచి కోలుకుంటున్న రవీంద్ర జడేజానూ జట్టులోకి తీసుకున్నా... ఫిట్‌నెస్ నిరూపించుకుంటేనే ఆడతాడు. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఫిబ్రవరి 9నుంచి నాగపూర్‌లో తొలి టెస్టు జరుగుతుంది.

టెస్టు జట్టు వివరాలు: రోహిత్ శర్మ (కెప్టెన్), రాహుల్, గిల్, పుజారా, కోహ్లి, శ్రేయస్, కేఎస్ భరత్, ఇషాన్ కిషన్, అశ్విన్, అక్షర్, కుల్దీప్, జడేజా, షమీ, సిరాజ్, ఉమేశ్, ఉనాద్కట్, సూర్యకుమార్.



న్యూజిలాండ్‌దే సిరీస్

కరాచీ: పాకిస్తాన్ గడ్డపై మూడు మ్యాచ్‌ల ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను న్యూజిలాండ్ జట్టు తొలిసారి సొంతం చేసుకుంది. పాకిస్తాన్‌తో శుక్రవారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో న్యూజిలాండ్ రెండు వికెట్ల తేడాతో గెలిచింది. తద్వారా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను న్యూజిలాండ్ 2-1తో దక్కించుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 280 పరుగులు చేసింది. ఫఖర్ జమాన్ (101; 10 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించాడు. మొహమ్మద్ రిజ్వాన్ (77; 6 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. కివీస్ బౌలర్లలో టిమ్ సౌతీ (3/56) ఆకట్టుకున్నాడు. అనంతరం న్యూజిలాండ్ 48.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 281 పరుగులు చేసి విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' డెవాన్ కాన్వే (52; 5 ఫోర్లు, 1 సిక్స్), విలియమ్సన్ (53; 2 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్లెన్ ఫిలిప్స్ (42 బంతుల్లో 63 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించి న్యూజిలాండ్ విజయంలో కీలకపాత్ర పోషించారు. పాక్‌తో సిరీస్ ముగించుకున్న న్యూజిలాండ్ ఈనెల 18 నుంచి భారత్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది.

టి20లకు పృథ్వీ షా, వన్డేల్లో భరత్

న్యూజిలాండ్‌తో సిరీస్‌లకు భారత జట్లు

ముంబై: ఏడాదిన్నర క్రితం అంతర్జాతీయ టి20ల్లో తాను ఆడిన ఏకైక టి20లో తొలి బంతికే అవుటైన పృథ్వీ షా భారత జట్టులోకి పునరాగమనం చేశాడు. న్యూజిలాండ్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల సిరీస్ కోసం సెలక్టర్లు అతడికి అవకాశం కల్పించారు. ఇది మినహా చెప్పుకోదగ్గ మార్పులేమీ లేకుండా ఇటీవల శ్రీలంకతో టి20 సిరీస్ గెలిచిన జట్టునే ఎంపిక చేశారు. కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా కొనసాగనున్నాడు. ఈ సిరీస్‌లో కూడా రోహిత్, కోహ్లిలను ఎంపిక చేయకపోవడంతో అది 'విశ్రాంతి'నా లేక టి20 భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగా వారిని పక్కన పెట్టేశారా అనేదానిపై స్పష్టత లేదు. జనవరి 27, 29, ఫిబ్రవరి 1 తేదీల్లో టి20 మ్యాచ్‌లు జరుగుతాయి. వన్డే జట్టులో ఆంధ్ర వికెట్ కీపర్ కేఎస్ భరత్‌కు తొలిసారి అవకాశం లభించింది. శార్దుల్ ఠాకూర్ పునరాగమనం చేయగా, లెఫ్టార్మ్ స్పిన్నర్ షహబాజ్ అహ్మద్‌కు కూడా చోటు కల్పించారు. వన్డేల్లో మాత్రం రోహిత్, కోహ్లి అందుబాటులో ఉంటారు. వ్యక్తిగత కారణాలతో కేఎల్ రాహుల్, అక్షర్‌లను రెండు జట్లలోనూ ఎంపిక చేయలేదని సెలక్టర్లు వెల్లడించారు. ఈ నెల 18, 21, 24 తేదీల్లో వన్డేలు జరుగుతాయి.



వన్డే జట్టు: రోహిత్ (కెప్టెన్), గిల్, ఇషాన్ కిషన్, కోహ్లి, శ్రేయస్, సూర్యకుమార్, భరత్, హార్దిక్, సుందర్, షహబాజ్, శార్దుల్, చహల్, కుల్దీప్, షమీ, సిరాజ్, ఉమ్రాన్. **టి20 జట్టు:** హార్దిక్ (కెప్టెన్), సూర్యకుమార్, ఇషాన్ కిషన్, రుతురాజ్, గిల్, దీపక్ హుడా, రాహుల్ త్రిపాఠి, జితేశ్ శర్మ, సుందర్, కుల్దీప్, చహల్, అర్ష్‌దీప్, ఉమ్రాన్, మావి, పృథ్వీ షా, ముకేశ్ కుమార్.